ఆటో డ్రైవర్లపై దాడులు ఆపాలి


మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

లాలాపేట: స్పెషల్ డ్రైవ్‌ల పేరుతో ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బెజ్జాల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం తార్నాకలో ఆటో డ్రైవర్లు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీనికి తోడు లైసెన్స్ లేదని, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సురెన్స్ లేదంటూ పోలీసులు చలాన్లు విధిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. పోలీసుల దాడులపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు మధుకర్, బాల్‌రాజు, శ్రీనివాస్, సురేశ్, వెంకట్, నరసింహ తదితరులున్నారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్ రాజు

రసూల్‌పురా: యువత నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ జి.శంకర్ రాజు తెలిపారు. కంటోన్మెంట్ బైసన్ పోలో మైదానంలో ఎన్‌సీసీ బాలికల క్యాడెట్ల శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు–నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ఏసీపీ మాట్లాడారు. రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బండి నడిపితే ఐదు వేల వరకు జరిమానా, మూడు నెలల జైలు శిక్ష విధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఆనంద్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ మీను తోమర్, ట్రాఫిక్ ఏఎస్సై మొహమ్మద్ ఆదిల్, సిద్ధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు


వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

లాలాపేట: నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు గురువారం సాయంత్రం హబ్సిగూడ ప్రాంతంలో ఆపరేషన్ రోప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి చలాన్లు విధించారు. ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన షాపులను వేరే చోటకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై జయానంద్, ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాణికేశ్వరనగర్‌లో ప్రత్యేక కౌంటర్

లాలాపేట: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలనీ మాజీ వార్డుమెంబర్ లాజరస్ అన్నారు. ఈమేరకు గురువారం మాణికేశ్వర్‌నగర్ ఏడుగుళ్ల కమ్యునిటీ హాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. అభయహస్తం దరఖాస్తులు అందనివారు ఎవరైనా ఉంటే ఏడుగుళ్ల కమ్యునిటీ హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సంప్రదించాలన్నారు.

పుస్తకావిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: దామెర వీరయ్య రచించిన అన్‌నోన్ అన్‌టచబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. గురువారం ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఐఏఎస్ అధికారి సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, రిటైర్ పోలీసు ఆఫీసర్ డా.రాజు, ఐఏఎస్ విజయ్‌కుమార్, స్టీఫెన్ తదితరులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే పద్మారావును కలిసిన నేతలు



లాలాపేట: తార్నాక డివిజన్ బీఆర్ఎస్ నాయకులు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను ఆయన నివాసంలో గురువారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, హన్మంత్ యాదవ్ తదితరులున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్ల వంకాయ రూ.45, పొడుగు వంకాయ రూ.45, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.45, బజ్జీ మిర్చి రూ.45, క్యాప్సికమ్ రూ.70, పచ్చకాకర రూ.55, పందిరి బీర రూ.45, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.38, దొండ రూ.35, గుండు బీన్స్ రూ.45, గింజ చిక్కుడు రూ.55, గోకరకాయ రూ.50, కీర రూ.15, దోసకాయ రూ.35, బీట్‌రూట్ రూ.21, ఉల్లిగడ్డ రూ.24, ఆలుగడ్డ రూ.21, చామగడ్డ రూ.55, మొరంగడ్డ రూ.28, కందగడ్డ రూ.23, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.9, మునగ రూ.4–6, ముల్లంగి రూ.4–6.


ప్రకాశ్‌నగర్ ప్రాంతాన్ని సందర్శించిన నారాయణ


ఎక్స్‌టెన్షన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బండి రమేశ్

రోజు కూలీలపై రౌడీయిజమా?

- భూ కబ్జాదారులు, గ్యాంగ్‌స్టర్లకు భయపడొద్దు
- ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ నివాసితులకు అండ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ

సనత్‌నగర్: రౌడీలు, భూ కబ్జాదారులు, గ్యాంగ్‌స్టర్లకు భయపడొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ సూచించారు. దానం నాగేందర్ అనుచరులు తమ ఇళ్లు కూల్చివేశారని ఆరోపిస్తూ బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బస్తీవాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు గురువారం బస్తీని పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దాదాపు 30 ఏళ్ల నుంచి ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో నిరుపేదలు నివసిస్తున్నారని, వారి ఇళ్లను రాత్రికి రాత్రే కూల్చేయడం దారుణమన్నారు. నిరుపేదల ఇళ్లు కూల్చే హక్కు ఎవరిచ్చారని, స్థలం తమదైతే కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకోవాలి తప్ప దౌర్జన్యం చేయకూడదని తెలిపారు. రోజు కూలీలపై రౌడీయిజం చేస్తే తమ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఎవరి స్థలాల్లో వారు ధైర్యంగా ఇళ్లు వేసుకోవాలని, తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బాధితులకు ప్రభుత్వ అండ

సనత్‌నగర్: పేదల ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వంతో మాట్లాడతామని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బస్తీని గురువారం ఆయన సందర్శించారు. స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. తమ ఇళ్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులు కూల్చివేశారని బాధితులు రమేష్‌తో మొరపెట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూకబ్జాలు, దందాల పేరిట పేద ప్రజలను భయపెడితే కేసులు తప్పవన్నారు. రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయినట్టు చూపించి కబ్జాదారులు రూ.40 కోట్ల నష్టపరిహారం తీసుకున్నట్టు తెలిసిందన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రమేశ్ వెంట స్థానిక నేతలు గౌరపల్లి రమేశ్, హోసీటోచర్, దినేశ్‌కుమార్, సతీశ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

గడువు తేదీ పొడిగించేలా విజ్ఞప్తి చేస్తాం


దరఖాస్తులు అందిస్తున్న యాదగిరి

అడ్డగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడ్డగుట్ట వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్.యాదగిరి కోరారు. ఈ మేరకు అడ్డగుట్టలోని తన కార్యాలయంలో గురువారం దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. దరఖాస్తులకు చివరి తేదీ సమీపిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. గడువు తేదీ పొడిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుచిత్ర, ఎల్లమ్మ, వెంకట లక్ష్మి, వజ్రమ్మ, రూపా, నర్సింగరావు, మల్లేశ్ తదితరులున్నారు.

రాష్ట్రంలోని వర్సిటీలను అభివృద్ధి చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

ఉస్మానియా యూనివర్సిటీ: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో ప్రారంభమైన యూనివర్సిటీలపై బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. గత పదేళ్లలో వర్సిటీలు పూర్తిగా నిర్వీర్యమైనయని చెప్పారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీ, ఓయూకు రూ.1000 కోట్లు, ఇతర వర్సిటీలకు రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు, పరిశోధనల కోసం ప్రత్యేకంగా ప్రతి వర్సిటీకి రూ.50 కోట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల రెగ్యులరైజేషన్, వర్సిటీల భూములను రక్షించాలని కోరారు. సమావేశంలో విద్యార్థి నేతలు లెనిన్, నెల్లి సత్య, ఉదయ్, భగత్, అశ్విన్, రమేశ్, మధు, సాయి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

‘పదేళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా’

ఉస్మానియా యూనివర్సిటీ: గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిపై మాజీ మంత్రి కేటీఆర్ సిద్ధమా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోని 420 అనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కేటీఆర్ ఫొటోలను ఆర్ట్స్ కాలేజీ ఎదుట దహనం చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో దయాకర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలవుతున్న ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతమైందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలలో జరిగిన లక్షల కోట్ల రూపాయల అవినీతిపై ఓయూ ఆర్ట్స్ కాలేజీ వేదికగా చర్చకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నిరుద్యోగులను మోసగించిన బీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చినా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మెడ శ్రీను, బీసీ సంఘం నేత మహేశ్ గౌడ్, విజయ్, సెమన్, వీరేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఓయూ జేఏసీ చైర్మన్, టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమ్‌రావ్ నాయక్ అన్నారు. గురువారం ఓయూలోని ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులని అడ్డుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాము నాయక్, కొర్ర రవి, సురేందర్ నాయక్, బాల సుబ్రహ్మణ్యం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పెండింగ్ పనులు పూర్తి


చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్

సనత్‌నగర్: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో పెండింగ్ పనులన్నీ పూర్తవుతున్నాయని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను గురువారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లనే దీర్ఘకాలిక సమస్యలు సైతం పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈఈ యతీంద్రమోహన్, జలమండలి డీజీఎం వంశీ, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఫాజిల్, సురేశ్‌గౌడ్, సర్ఫ్, సంతోశ్, ఖలీల్‌బేగ్, రాజు, పుష్పలత, పద్మ, సరితగౌడ్, రాజేశ్ ముదిరాజ్, జమీర్‌బేగ్, పురుషోత్తం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: అనుమతి లేకుండా కొనసాగుతున్న ఇంటర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు సెక్రెటరీ శృతి ఓజాకు గురువారం వినతిపత్రం అందించారు.

పీహెచ్‌డీ ప్రవేశాలు చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: సాధ్యమైనంత త్వరగా పీహెచ్‌డీ ప్రవేశాలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్ గురువారం డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేటగిరి–1 నెట్, సెట్, జేఆర్ఎఫ్ అభ్యర్థులకు నేరుగా పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించాలన్నారు. మరోవైపు కేటగిరి–2 ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలకు ఇంత వరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదని గుర్తుచేశారు. 2024లో ఓయూలో విడుదల చేయనున్న పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో ర్యాంక్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్వ్యూలో 15 శాతంతో పాటు పీజీ మార్కులకు వెయిటేజీ ఇవ్వాలన్నారు. వీటితో పాటు పరిశోధన వ్యాసాలను పరిగణలోకి తీసుకొలని అధికారులను కోరారు.

నగరంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ కోసం పోరాడి జైలుకు వెళ్లిన ఓయూ ఉద్యమ విద్యార్థి నాయకులకు నగరంలోనే 250 గజాల స్థలాలు కేటాయించాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ బండారు వీరబాబు గురువారం డిమాండ్ చేశారు. ఉద్యమ కేసులు హైదరాబాద్‌లో ఉంటే ఇళ్ల స్థలాలు మాత్రం మారుమూల ప్రాంతాల్లో ఇవ్వడం సరికాదన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా ప్రకటన ఇవ్వాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత




అడ్డగుట్ట: మురికివాడల్లోని ప్రజలను అందుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని భవిష్య సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు నాగపూరి రాజుగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం అడ్డగుట్ట డివిజన్‌లోని వెంకట్‌నగర్‌కు చెందిన మంజుల కుటుంబానికి ట్రస్ట్ తరుపున రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. రాజుగౌడ్ మాట్లాడుతూ.. తమ సేవా ట్రస్ట్ తరుపున నిరంతరం పేదలకు సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానికులు నందు, రిచర్డ్, దిలీప్, కన్నా, రఫీ తదితరులున్నారు.

మద్యం తాగిన వ్యక్తికి జైలు శిక్ష

రాంగోపాల్‌పేట్: మద్యం తాగి న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తిపై రాంగోపాల్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగుట్టకు చెందిన ప్రైవేటు ఉద్యోగి రజాక్(21) ఈ నెల 3వ తేదీన తాగి బస్తీలో హంగామా చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు రజాక్‌పై కేసు నమోదు చేసి గురువారం ఉదయం కోర్టుకు తరలించారు. నిందితుడికి సికింద్రాబాద్ 16వ స్పెషల్ మెట్రోపాలిటన్ జస్టిస్ 8 రోజుల జైలు శిక్ష విధించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని మహంకాళి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ సాయంత్రం పోలీస్‌స్టేషన్ వెనుక వైపు గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందన్న సమాచారం పోలీసులకు అందింది. మృతురాలికి సుమారు 65–70 సంవత్సరాల వయస్సుంటుందని, ఒంటిపై మెరూన్, ఎల్లో కలర్ చీర ధరించి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచామని చెప్పారు.

ప్రజాపాలనలో 40 వేల దరఖాస్తుల స్వీకరణ

డిప్యూటీ కమిషనర్ శంకర్



బన్సీలాల్‌పేట్: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి 40 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ తెలిపారు. ఈమేరకు గురువారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అభయహస్తం గ్యారంటీ పథకాల కోసం పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తులు చేసుకుంటున్నారని చెప్పారు. ఆయా సెంటర్లలో తమ సిబ్బంది ఉచితంగా దరఖాస్తులు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం జనవరి 6 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రజాపాలన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

సర్కిల్ పరిధిలో 16 సెంటర్లు

బేగంపేట్ సర్కిల్ పరిధిలో 16 ప్రజాపాలన సెంటర్లు ఏర్పాటు చేశామని శంకర్ తెలిపారు. ప్రతి సెంటర్‌కు ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఆయా సెంటర్లలో మొత్తం 144 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు


తార్నాకలో దరఖాస్తు ఫారాలు అందిస్తున్న అనిల్‌కుమార్

లాలాపేట: ఇందిరమ్మ అభయహస్తం ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అందేలా తాము బాధ్యత తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు తార్నాక డివిజన్‌లో గురువారం ఆయన పర్యటించారు. స్థానిక వార్డు కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నాయకులతో కలిసి అనిల్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ప్రజలకు దరఖాస్తు ఫారాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ యాదవ్, అమర్‌నాథ్‌గౌడ్, బ్రహ్మాజీ, ప్రవీన్ లాల్, శ్రీనివాస్, రవి, గణేశ్ యాదవ్ తదితరులున్నారు.

ఇచ్చిన మాట ప్రకారమే..


దరఖాస్తు రసీదు అందిస్తున్న వెన్నెల

రసూల్‌పురా: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందే వరకు ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ జీవి.వెన్నెల చెప్పారు. గురువారం బొల్లారం డౌటన్ బజార్ రీడింగ్ రూమ్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన అభయహస్తం కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం స్థానికులకు దరఖాస్తు ఫారాల రసీదులు అందించారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాల్‌రాజు, నరేశ్ యాదవ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట మయూర్ మార్గ్‌లో..



బేగంపేట మయూర్ మార్గ్‌లోని అంబేడ్కర్ కమిటీ హాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన పథకానికి సంబంధించిన దరఖాస్తులను కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ , బేగంపేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌరపల్లి రమేశ్ ప్రజలకు అందించారు.

ఊరు వెళ్లేందుకు వచ్చి అదృశ్యం


అదృశ్యమైన వ్యక్తి వైభవ్

రాంగోపాల్‌పేట్: సొంత ప్రాంతానికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకారం మహారాష్ట్ర కల్యాణ్ థానేకు చెందిన వైభవ్ బాబాజీ జాదవ్‌తో పాటు మరో నలుగురు స్నేహితులు గత నెల 12వ తేదీన జల్‌పల్లిలో డెకొరేషన్ పని నిమిత్తం నగరానికి వచ్చారు. 30వ తేదీన పని పూర్తి కావడంతో జల్‌పల్లి నుంచి ఇద్దరు మహారాష్ట్ర కల్యాన్ థానేకు వెళ్లారు. మరో ఇద్దరు దేవిదాస్ బాలిద్, దీపక్ బాలేరావుతో కలిసి వైభవ్ రాత్రి 9 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ముగ్గురు కలిసి అక్కడే మద్యం తాగి భోజనం చేశారు. రాత్రి మహారాష్ట్ర వెళ్లేందుకు ఎలాంటి ట్రైన్‌లు లేకపోవడంతో ఔట్‌గేట్ ప్రాంతంలో పడుకున్నారు. 10 గంటల సమయంలో వైభవ్ టాయిలెట్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. వైభవ్ కోసం స్నేహితులు వెదికినా కనిపించ లేదు. దీంతో తర్వాత రోజు ఇద్దరూ కల్యాణ్‌కు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న వైభవ్ భార్య ఈ నెల 1వ తేదీన గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మద్యం మత్తులో ప్రహరీని ఢీకొట్టి..


ప్రమాదం చేసిన వ్యక్తులు

సనత్‌నగర్: మద్యం మత్తులో కారు నడిపి ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్ హఫీజ్‌పేటకు చెందిన శివప్రసాద్, భరత్, శ్రీనివాస్, కృష్ణానగర్‌కు చెందిన అభిషేక్ స్నేహితులు. వీరంతా ఈ నెల 3న కారులో యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో జరిగిన పార్టీకి హాజరయ్యారు. శివప్రసాద్, భరత్, అభిషేక్ మద్యం తాగి భోజనం చేసేందుకు మాదాపూర్ వెళ్లారు. అక్కడి నుంచి అభిషేక్‌ను కృష్ణానగర్‌లో దించేందుకు బయలుదేరారు. శివప్రసాద్ కారు అతివేగంగా నడుపుతూ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లోని ప్లాట్ నెంబర్ 122కు చెందిన ప్రహరీని ఢీకొట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

యువతిని వేధించిన వ్యక్తి రిమాండ్

అడ్డగుట్ట: ప్రేమ పేరుతో ఓ యువతిని వేధించిన యువకుడిపై తకారాంగేట్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు చెప్పిన వివరాలు.. షాద్‌నగర్‌కు చెందిన హరీశ్(22) ప్రైవేటు ఉద్యోగి. ఈస్ట్‌మారేడుపల్లిలోని ఓ యువతి(19)తో పరిచయం ఏర్పరుచుకొని రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం నడిపించాడు. అయితే, కొద్ది రోజులుగా సదరు యువతికి హరీశ్‌కి మధ్య గొడవలు జరగడంతో విడిపోయారు. ఈక్రమంలో కొంత కాలంగా హరీశ్ యువతిని వేధిస్తూ వచ్చాడు. ఇన్‌స్టాగామ్‌లో వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు స్థానిక తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు హరీశ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించారు.

చీత్కారం

ఓయూ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని గురువారం రాస్తారోకో చేసిన పీహెచ్‌డీ విద్యార్థులు. ఆందోళనకు వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. విద్యార్థినులకు రక్షణ కల్పించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. – ఉస్మానియా యూనివర్సిటీ





ప్రయాణం

అంబర్‌నగర్‌లోని లలితానగర్‌లో శ్రీ ధర్మశాస్త్ర సన్నిదానం 30వ వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్ప స్వాములతో గురువారం భారీ ఊరేగింపు నిర్వహించారు. దాదాపు 200 మంది ఊరేగింపులో పాల్గొని శబరిమలకు పయనమయ్యారు. కార్యక్రమంలో సన్నిదానం గురుస్వాములు రాజు గురుస్వామి, వినోద్‌ఖన్నా, భావన్, శ్రీకాంత్, నర్సింగ్, నవీన్, జగన్, మహేశ్, గోపి తదితరులున్నారు. –బౌద్ధనగర్

సత్కారం

బౌద్ధనగర్: ఖమ్మం కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్‌దత్‌ను గురువారం సత్కరిస్తున్న బౌద్ధనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాయకుడు రవిప్రసాద్ గౌడ్

